సచివాలయ వ్యవస్థతో ఇంటి వద్దకే పౌర సేవలు

- ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య
- నండూరులో నూతన సచివాలయ భవనం ప్రారంభం


నూతన సచివాలయ భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రోశయ్య

పొన్నూరు: సచివాలయం, వలంటరీ వ్యవస్థ ద్వారా ఇంటి వద్దకే పౌర సేవల్ని తీసుకువచ్చిన ఘనత ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య పేర్కొన్నారు. మండలంలోని నండూరులో గురువారం రూ. 44 లక్షలతో నిర్మించిన నూతన సచివాలయ భవనాన్ని ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రారంభించారు. సచివాలయం నిధులు రూ. 20 లక్షలతో నిర్మించనున్న సీసీ రోడ్లకు శంకుస్థాపన చేశారు. అనంతరం సచివాలయం ఆవరణలో నిర్వహించిన సభకు సర్పంచ్ అక్కి నాగరాజు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య మాట్లాడుతూ ప్రభుత్వ సేవలు అందించే నూతన సచివాలయం ప్రారంభించడం శుభ పరిణామమని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రజల సంక్షేమం, అభివృద్ధి ధ్యేయంగా ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని తెలిపారు.

హాస్యాస్పదంగా చంద్రబాబు మాటలు

రాష్ట్రాన్ని తనలాగా అభివృద్ధి చేసిన నాయకుడు లేడని జైలుకు వెళ్లి వచ్చిన చంద్రబాబు చెప్పడం హాస్యాస్పదంగా ఉందని ఎమ్మెల్యే ఎద్దేవా చేశారు. ప్రజల్ని మోసగించడంలో టీడీపీకి ఉన్న నైపుణ్యం మరే పార్టీకి లేదని విమర్శించారు. గత టీడీపీ పాలనలో పార్టీ కార్యకర్తలకే లబ్ధి చేకూర్చేలా జన్మభూమి కమిటీలు వ్యవహరించాయని ఆరోపించారు. ఎల్లో మీడియాను ఆధారంగా చేసుకొని దుష్ప్రచారాల పార్టీగా టీడీపీ మారిందని విమర్శించారు. నేడు సీఎం జగన్ ప్రభుత్వం కుల మతాలకతీతంగా అర్హతయే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు ప్రజలకు అందిస్తోందని తెలిపారు. రాజకీయంగా ఎవరి ప్రమేయం లేకుండా లబ్ధిదారుల ఖాతాల్లోనే నేరుగా నగదు జమ చేస్తున్నారని చెప్పారు. విద్య, వైద్యం, వ్యవసాయ రంగానికి అధిక ప్రాధాన్యతనిస్తూ ప్రజల ఆర్థిక అభివృద్ధికి ప్రభుత్వం తోడ్పాటు అందిస్తోందని వివరించారు. నండూరులో గత నాలుగున్నర ఏళ్లలో కోట్లాది రూపాయల సంక్షేమం, అభివృద్ధి జరిగాయని తెలిపారు. పొన్నూరులో పాతికేళ్ల టీడీపీ పాలనలో చేయని అభివృద్ధిని, నాలుగున్నర ఏళ్లలో తాను చేసి చూపిస్తుంటే ఆ పార్టీ నేతలు సహించలేకపోతున్నారని విమర్శించారు. నియోజకవర్గ అభివద్ధికి కట్టుబడి ఉంటానని ఎమ్మెల్యే రోశయ్య స్పష్టం చేశారు. అనంతరం ఆయన్ను నేతలు ఘనంగా సత్కరించారు.

వైఎస్సార్ సీపీలో చేరిక

గ్రామానికి చెందిన బుడ్డా శ్రీనివాసరావు, రాజ్యలక్ష్మి కుటుంబీకులు ఎమ్మెల్యే సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వారిని ఆత్మీయంగా పలకరించి పార్టీలోకి స్వాగతం పలికారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు వల్లూరి శ్రీనివాసరావు, మోపర్తి అయ్యన్న, పార్టీ రూరల్ అధ్యక్షుడు రుద్రపాటి ఆదిశేషులు, మార్కెట్ యార్డ్ చైర్మన్ ఆకుల వెంకటేశ్వరరావు, రాష్ట్ర ఇరిగేషన్ శాఖ డైరెక్టర్ దాసరి నారాయణరావు, జిల్లా వ్యవసాయ శాఖ సలహా మండలి డైరెక్టర్ బొద్దులూరి రంగారావు, కాంట్రాక్టర్ జంగా అబ్రహం దంపతులు, ఎంపీటీసీ సభ్యుడు నార్నిపాటి నాగరాజు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ప్రతి కుటుంబం ఆర్థికాభివృద్ధి జగనన్న లక్ష్యం

- ఎమ్మెల్యే మేకతోటి సుచరిత
- రూ. 37 లక్షల ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కుల పంపిణీ



గుంటూరు రూరల్: ప్రతి కుటుంబాన్నీ ఆర్థికంగా అభివృద్ధి చేయడం రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమని ఎమ్మెల్యే మేకతోటి సుచరిత పేర్కొన్నారు. నగరంలోని తన కార్యాలయంలో మంగళవారం రూ. 37 లక్షల విలువైన ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కుల్ని ఆమె లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆరోగ్యశ్రీ ద్వారా పేదలకు కార్పొరేట్ వైద్యాన్ని అందిస్తూ వారికి జగనన్న అండగా ఉంటున్నారని తెలిపారు. ముఖ్యమంత్రి సహాయనిధితో కూడా అత్యవసర సమయాల్లో ఆదుకుంటున్నారని చెప్పారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలను అరికట్టడం ప్రతి ఒక్కరి బాధ్యత

పెదకాకాని: బాల్య వివాహాలను అరికట్టడం ప్రతి ఒక్కరూ బాధ్యతగా భావించాలని గ్రామ సర్పంచి కర్నాటి శ్రీనివాసరావు తెలిపారు. మండలంలోని ఉప్పలపాడులో గురువారం చైల్డ్ రైట్స్ అడ్వకసీ ఫౌండేషన్(క్రాఫ్) ఆధ్వర్యంలో గ్రామ బాల్య వివాహ నిరోధక, పర్యవేక్షణ కమిటీ సమావేశం నిర్వహించారు. సర్పంచి శ్రీనివాసరావు మాట్లాడుతూ 18 సంవత్సరాల్లోపు ఆడపిల్లలకు, 21 సంవత్సరాల్లోపు మగ పిల్లలకు వివాహాలు చేయడం నేరమని చెప్పారు. గ్రామంలో బాల్య వివాహాలు జరగకుండా చూడవలసి బాధ్యత కమిటీ సభ్యులపై ఉందని తెలిపారు. కార్యక్రమంలో హిందీ ఉపాధ్యాయుడు రామారావు, క్రాఫ్ సంస్థ సిబ్బంది పాల్గొన్నారు.


27 నుంచి భావనారాయణ స్వామి ఆలయంలో కుంభాభిషేకం

పొన్నూరు: పట్టణంలోని శ్రీ సుందరవల్లి రాజ్యలక్ష్మి సమేత శ్రీ సాక్షి భావనారాయణ స్వామి దేవస్థానంలో ఈనెల 27, 28, 29 తేదీల్లో నిర్వహించనున్న కుంభాభిషేకంలో భక్తులు విశేషంగా పాల్గొనాలని ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య కోరారు. ఆలయ ప్రాంగణంలో గురువారం నిర్వహించిన కమిటీ సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ప్రధాన అర్చకులు రఘునాథచార్యులు మాట్లాడుతూ 27వ తేదీ నుంచి మూడు రోజులపాటు స్వామివారికి విశేష కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. సమావేశంలో ఈవోలు టి. శ్రీనివాస్, ఆర్. రమణమ్మ, మార్కెట్ యార్డ్ చైర్మన్ ఆకుల వెంకటేశ్వరరావు, ఆలయ మాజీ చైర్మన్ నాగసూరి ప్రతాప్ కుమార్, వివిధ ఆలయాల కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

రేపు కనకమహాలక్ష్మి కో-ఆపరేటివ్ బ్యాంక్ ప్రారంభం

గుంటూరు రూరల్: విశాఖపట్నం అక్కయ్యపాలెం ప్రధాన కార్యాలయంగా ఉన్న కనకమహాలక్ష్మి కో-ఆపరేటివ్ బ్యాంచ్ 28వ బ్రాంచ్‌ను గుంటూరులోని ఇన్నర్ రింగ్ రోడ్డులో శనివారం ప్రారంభించనున్నట్లు చైర్మన్ కొమ్మారెడ్డి రాంబాబు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. బ్యాంక్ రజతోత్సవాలలో భాగంగా నూతన శాఖను ప్రారంభించటం సంతోషకరమని ఆయన పేర్కొన్నారు. బ్యాంక్ ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథులుగా ఏపీ చాంబర్స్ సీనియర్ ఎగ్జిక్యూటివ్ ఉపాధ్యక్షుడు లంకా రఘురామిరెడ్డి, జాయింట్ రిజిస్ట్రార్ జిల్లా కో-ఆపరేటివ్ అధికారి ఎం.వీరాచారి, కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ చైర్మన్ బోనబోయిన శ్రీనివాసరావు, ఏలూరి కో- ఆపరేటివ్ బ్యాంక్ చైర్మన్ వై. గురవయ్య, గుంటూరు ఉమెన్ కో-ఆపరేటివ్ బ్యాంక్ చైర్‌పర్సన్ కె.వి. సుజాత, ఏపీ టెక్స్‌టైల్ మిల్స్ అసోసియేషన్ వైస్ చైర్మన్ సామినేని కోటేశ్వరరావు, బ్యాంక్ డైరెక్టర్లు పాల్గొంటారని వివరించారు. కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

నేడు తోట్లపాలెంలో ఇళ్ల ప్రారంభోత్సవం


ప్రారంభోత్సవానికి సిద్ధమైన జగనన్న ఇళ్లు

తోట్లపాలెం (చేబ్రోలు): మండలంలోని తోట్లపాలెం జగనన్న కాలనీలో ఇళ్లను శుక్రవారం ప్రారంభిస్తున్నట్లు స్థానిక వైఎస్సార్ సీపీ నాయకుడు కఠివరపు అశోక్ గురువారం తెలిపారు. ప్రభుత్వం అందించే ఆర్థిక సహాయంతో పాటు వీఆర్వో ఆర్గనైజేషన్ సంయుక్త ఆధ్వర్యంలో గ్రామంలో 30 ఇళ్లను నిర్మించినట్లు ఆయన పేర్కొన్నారు. శుక్రవారం సాయంత్రం జరిగే ప్రారంభోత్సవంలో ముఖ్య అతిథులుగా ఎమ్మెల్సీ ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు, పొన్నూరు శాసనసభ్యుడు కిలారి వెంకట రోశయ్య, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా, స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు, అధికారులు, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొననున్నట్లు అశోక్ పేర్కొన్నారు.

పంట పొలాలకు పుష్కలంగా నీరు

నియోజకవర్గంలో పంట పొలాలకు నీటి కొరత లేదని, రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య అన్నారు. గురువారం పొన్నూరు వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. తెలుగు దుష్ప్రచారాల పార్టీ (టీడీపీ) కావాలని ప్రభుత్వంపై బురద చల్లుతుందని విమర్శించారు. గత ప్రభుత్వ హయాంలో నియోజవర్గంలోని సాగునీటి కాలువల్లో కనీసం తూటి కాడ, జమ్ము కూడా తీయకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించిందని పేర్కొన్నారు. ప్రస్తుతం పంట కాలువల్లో పూర్తిస్థాయిలో జమ్ము తొలగించి పొలాలకు నీటి సరఫరా చేస్తున్నట్లు తెలిపారు. ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్ మోహన్‌రెడ్డి నేతృత్వంలోని ప్రభుత్వం రైతు ప్రభుత్వంగా పేర్కొన్నారు. రైతులందరికీ అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి వారి అభివృద్ధికి తోడ్పాటు అందిస్తోందని తెలిపారు. గత తెలుగుదేశం పార్టీ ప్రభుత్వం రైతులకు ఎలాంటి ప్రయోజనాలు చేకూర్చలేదని, ఏ విధంగా మోసం చేసిందో రైతులతో పాటు రాష్ట్ర ప్రజానీకానికి అందరికీ తెలుసన్నారు. మనుగడ కోల్పోయిన టీడీపీ తన ఉనికి కోసం అవాస్తవాలు ప్రచారం చేస్తోందని విమర్శించారు.

సాగునీటిని సద్వినియోగం చేసుకోవాలి


హైలెవల్ చానల్ ద్వారా నీటి సరఫరాను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

పెదకాకాని: కాలువల ద్వారా సరఫరా అవుతున్న సాగునీటిని రైతులంతా సద్వినియోగం చేసుకుని పంటలు పండించుకోవాలని ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య సూచించారు. వర్షాభావ పరిస్థితులు నెలకొన్న నేపథ్యంలో పంట కాలువల ద్వారా ప్రవహిస్తున్న నీటి పరిమాణాన్ని పరిశీలించేందుకు గురువారం ఆయన మండలంలోని వెంకటకృష్ణాపురం, ఉప్పలపాడు, గోళ్లమూడి గ్రామ శివార్లలో వరి పైర్లతో పాటు హై లెవల్ చానల్ (పాత కాలువ) ద్వారా నీటి సరఫరాను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ హై లెవల్ కాలువకు నీటి పరిమాణం తగ్గినట్లు రైతులు తన దృష్టికి తీసుకు రావడంతో గుంటూరు చానల్ నుంచి ఉన్న బోదె కాలువల్లో పొక్లెయిన్ ద్వారా తూటికాడ, జమ్ము, నాచు శుభ్రం చేయించినట్లు చెప్పారు. ఈ ప్రాంతంలో వరి పంటలు ఎక్కడా ఎండిపోలేదని, సస్యశ్యామలంగా ఉన్నాయని పేర్కొన్నారు. రైతులెవరూ దుష్ప్రచారాల టీడీపీ మాటలు నమ్మవద్దని ఆయన సూచించారు.మండల రైతు సలహా మండలి చైర్మన్ దంతాల వెంకటేశ్వరరావు మాట్లాడుతూ మండలంలోని తంగెళ్లమూడి గ్రామ శివారు మెరక పొలాలకు నీరు అందక కొంత ఇబ్బంది ఉన్న మాట వాస్తవమేనని, ప్రతికూల వాతావరణ పరిస్థితుల్లో కూడా పంట కాలువల ద్వారా పొలాలకు నీరు ఇస్తున్న ఘనత వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికి దక్కుతుందని తెలిపారు. సమస్యను చెప్పిన వెంటనే స్పందించిన ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య గుంటూరు చానల్ నుంచి పాత కాలువలకు నీటి సరఫరా చేయించారని చెప్పారు. కార్యక్రమంలో శివాలయం పాలకవర్గం చైర్మన్ అమ్మిశెట్టి శివశంకరరావు, ఉప్పలపాడు, గోళ్లమూడి గ్రామాల రైతులు పాల్గొన్నారు.

రోడ్ల వెంబడి వ్యర్థాలు డంప్ చెయ్యవద్దు

పంచాయతీ అధికారులకు డీపీవో ఆదేశాలు



ప్రత్తిపాడు: వ్యర్థాల్ని రోడ్ల వెంబడి డంప్ చేయవద్దని జిల్లా పంచాయతీ అధికారి కుసుమ శ్రీదేవి ప్రత్తిపాడు పంచాయతీ సిబ్బందిని ఆదేశించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయాన్ని గురువారం సాయంత్రం డీపీవో ఆకస్మికంగా సందర్శించారు. ఈవోపీఆర్డీ మావులూరి మోషే, ఎంపీడీవో కార్యాలయం ఏవో రామకోటయ్యలతో మాట్లాడారు. ఈ సందర్భంగా స్థానికులు డంపింగ్ యార్డు నిర్వహణ, కాలువల్లో పేరుకు పోతున్న మురుగు, దోమల బెడద వంటి అనేక విషయాల్ని డీపీవో దృష్టికి తీసుకువచ్చారు. డంపింగ్ యార్డు ఉన్నప్పటికీ రోడ్ల వెంబడి వ్యర్థాల్ని గుట్టలు గుట్టలుగా పడేస్తున్నారని ఆమెకు వివరించారు. సానుకూలంగా స్పందించిన ఆమె పంచాయతీ సిబ్బందికి స్పష్టమైన ఆదేశాలిచ్చారు. ఇప్పటికే రోడ్డు వెంట డంప్ చేసిన వ్యర్థాలను యార్డుకు తరలించాలని సూచించారు. మురుగు కాలువల్లో పూడికతీత చేపట్టాలని చెప్పారు. డీపీవోగా నియమితులైన తరువాత తొలిసారిగా మండలానికి వచ్చిన కుసుమ శ్రీదేవిని స్థానిక కార్యాలయం సిబ్బంది దుశ్శాలువాతో సత్కరించి, అభినందనలు తెలిపారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి

పట్నంబజారు: గుర్తు తెలియని వ్యక్తి అపస్మారక స్థితిలో మృతి చెందిన సంఘటన గుంటూరు నగరంలో చోటుచేసుకుంది. లాలాపేట సీఐ శ్రీనివాసరావు తెలిపిన వివరాల ప్రకారం .. లాలాపేట పరిధిలోని ఏడుగొందుల సమీపంలో నిత్యం సంచరించే యాచకుడు మురుగు కాలువలో పడి గురువారం మృతి చెందాడు. అయితే అతడు మద్యం మత్తులో పడి మృతి చెందాడా.. లేక శానిటైజర్ తాగాడా ? అనేది పోస్టుమార్టంలో తెలియాల్సి ఉందని సీఐ శ్రీనివాసరావు తెలిపారు. మృతదేహాన్ని మార్చురీకి తరలించినట్లు తెలిపారు.

700 బస్తాల రేషన్ బియ్యం స్వాధీనం

- లారీలో చుండూరు నుంచి కాకినాడకు తరలింపు?
- పట్టుకున్న విజిలెన్స్ అధికారులు
- నలుగురిపై కేసు నమోదు


లారీని స్వాధీనం చేసుకున్న విజిలెన్స్ సీఐ శ్రీహరిరావు, అధికారులు

చేబ్రోలు: రేషన్ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తున్న లారీని విజిలెన్స్ అధికారులు గురువారం స్వాధీనం చేసుకొని నలుగురిపై కేసు నమోదు చేసిన సంఘటన మండల కేంద్రమైన చేబ్రోలులో జరిగింది. సివిల్ సప్లయి, రెవెన్యూ అధికారులు తెలిపిన వివరాల ప్రకారం... బాపట్ల జిల్లా చుండూరు మండలం నుంచి చేబ్రోలు మీదుగా కాకినాడకు లారీలో రేషన్ బియ్యం అక్రమంగా రవాణా జరుగుతున్నట్లు విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులకు సమాచారం అందింది. విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఎస్పీ కె.ఈశ్వరరావు పర్యవేక్షణలో నిఘా వేశారు. చేబ్రోలులోని విఘ్నేశ్వర సినిమా హాలు వద్ద లారీని నిలుపదల చేసి తనిఖీలు నిర్వహించారు. తెల్ల ప్లాస్టిక్ గోతాలలో ఉన్న 700 బస్తాల రేషన్ బియ్యాన్ని గుర్తించారు. లారీ డ్రైవర్ ధీరజ్‌ను అదుపులోకి తీసుకొని విచారించారు. చుండూరులోని పద్మశ్రీ రైస్ మిల్లు నుంచి 700 బస్తాల రేషన్ బియ్యాన్ని మేడికొండ రవికుమార్ ఉరఫ్ గజనీ లారీలో లోడ్ చేసినట్లు, అతను చెప్పిన వివరాల ప్రకారం గుజరాత్ తీసుకొని వెళ్తున్నట్లు సమాచారం ఇచ్చాడు. కానీ రేషన్ బియ్యం కాకినాడ తరలిస్తున్నట్లు అధికారులు అనుమానిస్తున్నారు. ఒక్కో బస్తాలో 50 కేజీల చొప్పున 350 క్వింటాళ్ల బియ్యాన్ని, లారీని స్వాధీనం చేసుకున్నారు. లారీ యజమాని, డ్రైవర్, బియ్యం అక్రమ వ్యాపారం చేస్తున్న మేడికొండ రవికుమార్ ఉరఫ్ గజని, చుండూరు పద్మశ్రీ రైస్ మిల్ యజమానిపై క్రిమినల్ కేసు నమోదు చేయాలని చేబ్రోలు సీఎస్‌డీటీ భువనేశ్వరిని విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు ఆదేశించినారు. దాడుల్లో విజిలెన్స్ సీఐ ఎ.శ్రీహరిరావు, డీఎస్‌వో కోమలి పద్మ, తహసీల్దారు కె.వి. గోపాల కృష్ణ, డీటీ భువనేశ్వరి, పోలీసులు పాల్గొన్నారు.

విద్యార్థుల సామర్థ్యాల అంచనాలకు నేడు సీస్ పరీక్ష

- నియోజకవర్గంలోఎంపికచేసిన 188 పాఠశాలల్లో పరీక్షలు
- హాజరవ్వనున్న 4,593 మంది విద్యార్థులు
- ఏర్పాట్లు పూర్తి చేసిన విద్యాశాఖ అధికారులు


హెచ్‌ఎంలకు ఓఎంఆర్ షీట్లు పంపిణీ చేస్తున్న ఎంఈవోలు సీహెచ్ రమాదేవి, లీలారాణి

ప్రత్తిపాడు: విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలు, ఉపాధ్యాయుల బోధనా స్థాయిల్ని పరిశీలించేందుకు పాఠశాలల్లో స్కూల్ ఎడ్యుకేషనల్ అచీవ్ మెంట్ సర్వే (సీస్)- 2023ను ప్రభుత్వం నిర్వహిస్తోంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా మూడేళ్లకోసారి నిర్వహించే ఈ సర్వే శుక్రవారం నియోజకవర్గంలోని ప్రత్తిపాడు, పెదనందిపాడు, కాకుమాను, గుంటూరు రూరల్, వట్టిచెరుకూరు మండలాల పరిధిలో ఎంపిక చేయబడిన 188 పాఠశాలల్లో జరగనుంది. జాతీయ స్థాయిలో జరిగే ఈ పరీక్షలో పాల్గొనేందుకు విద్యార్థులు సన్నద్ధం కాగా, సమర్థంగా నిర్వహించేందుకు విద్యాశాఖ అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు.

గతానికి భిన్నంగా..

సీస్ (ఎస్ఈఏఎస్) సర్వే పరీక్ష ద్వారా ఈ ఏడాది 3, 6, 9 తరగతి విద్యార్థుల అభ్యసన సామర్థ్యాల్ని తెలుసుకోనున్నారు. 3వ తరగతి విద్యార్థులకు ఉదయం 10.30 నుంచి 11.30 వరకు 60 నిమిషాలు, 6వ తరగతి విద్యార్థులకు 75, 9వ తరగతి విద్యార్థులకు 90 నిమిషాల పాటు ఎఫ్ఎల్ఎన్ లాంగ్వేజ్-10, ఎఫ్ఎల్ఎస్ న్యూమరసీ-10, గణితం 10, లాంగ్వేజ్-10 మార్కులకు పరీక్షలు జరగనున్నాయి. పరీక్ష పూర్తిగా ఓఎంఆర్ షీట్ విధానంలోనే ఉంటుంది. దివ్యాంగులుంటే వారికి అదనంగా 30 నిమిషాలు సమయం ఇస్తారు. గతానికి భిన్నంగా ఈ ఏడాది ఫౌండేషన్ లిటరసీ అండ్ న్యూమరసీ (ఎఫ్ఎల్ఎన్) ప్రాతిపదికగా గణితం, భాషా సబ్జెక్టుల్లో ప్రశ్నలు ఇవ్వనున్నారు. స్టేట్ ఎడ్యుకేషన్ అచీవ్మెంట్ సర్వే(సీస్)లో భాగంగా క్షేత్ర స్థాయిలో పరీక్ష నిర్వహించేందుకు ఫీల్డ్ ఇన్వెస్టిగేటర్లుగా (ఎఫ్ఐ) బీఈడీ, డిగ్రీ చదువుతున్న విద్యార్థుల్ని నియమించారు. వీరికి ఇప్పటికే శిక్షణ కూడా ఇచ్చారు. మండల స్థాయిలో పరీక్షల నిర్వహణను ఎంఈవో-1 ఎంఈవో-2తో పాటు కాంప్లెక్స్ హెచ్ఎంలు నిర్వహించనున్నారు.

పక్కాగా పరీక్షల నిర్వహణ

సీస్ సర్వే విద్యార్థుల సామర్థ్యాల్ని తెలుసుకునేందుకు దోహదపడుతుంది.. విద్యార్థుల్లోని విద్యా ప్రమాణాలు, అభ్యసనాశక్తిని అంచనా వేయవచ్చు. ఎఫ్ఐలకు పూర్తి స్థాయిలో శిక్షణ ఇచ్చాం. విద్యార్థులకు మోడల్ పరీక్షల ద్వారా అవగాహన కల్పించాం. నేడు పక్కాగా ఎంపికచేసిన అన్ని ప్రభుత్వ, ప్రైవేట్, యాజమాన్య పాఠశాలల్లో పరీక్షలు జరపనున్నాం. ఇందుకు కావలసిన ఏర్పాట్లన్నీ పూర్తి చేశాం.

– సీహెచ్. రమాదేవి, ఎంఈవో, ప్రత్తిపాడు

పత్తిలో బెట్ట పరిస్థితులు అధిగమించాలి

కొండేపాడు పొలంబడిలో డీఆర్సీ డీడీఏ రామాంజనేయులు


పొలంబడిలో పత్తి పంటను పరిశీలిస్తున్న డీఆర్సీ డీడీఏ రామాంజనేయులు, శాస్త్రవేత్తలు

కొండేపాడు (ప్రత్తిపాడు): పత్తిలో కనిపిస్తున్న బెట్ట పరిస్థితుల్ని రైతులు సమర్థంగా అధిగమించాలని డీఆర్సీ డీడీఏ రామాంజనేయులు తెలిపారు. మండల పరిధిలోని కొండేపాడు, కోయవారిపాలెం గ్రామాల్లో గురువారం వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో పొలంబడి నిర్వహించారు. ఆయా గ్రామాల్లో సాగు చేసిన పత్తి పంటల్ని పరిశీలించారు. కాపాడుకునేందుకు రైతులు తీసుకుంటున్న చర్యలు, వినియోగిస్తున్న మందుల వివరాల్ని అడిగి తెలుసుకున్నారు. పత్తిలో బెట్ట పరిస్థితులు, రసం పీల్చు పురుగుల ఉధృతిని గమనించిన డీడీఏ రైతులకు పలు సూచనలిచ్చారు. బెట్ట పరిస్థితుల్లో మొక్క పోషణకు గాను రెండు శాతం యూరియా ద్రావణాన్ని లేదా రెండు శాతం పొటాషియం నైట్రేట్ ద్రావణాన్ని ఒక శాతం 19-19-19 ద్రావణాన్ని వారం వ్యవధిలో రెండు సార్లు పిచికారీ చేయాలని చెప్పారు. రసం పీల్చు పురుగులు ప్రస్తుతం తక్కువగానే ఉన్నాయన్నారు. రానున్న రోజుల్లో పురుగుల ఉధృతి ఆర్థిక నష్టపరిమితి స్థాయిని దాటితే ఐదు మి.లీ. వేపనూనెను లీటరు నీటిలో లేదా ఎసిటామిప్రిడ్ 20 ఎస్‌పిని 0.2 గ్రాములు లీటరు నీటికి లేదా డైఫెనుత్యురాన్ 50 డబ్ల్యూపిని 1.25 గ్రాములు లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలని తెలిపారు. ఆకుల అడుగు భాగం తడిచేలా మందును పిచికారీ చేయడం ద్వారా మంచి ఫలితాలుంటాయని వివరించారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు శ్రీలక్ష్మి, గంగాభవాని, ఏవోలు రాజవంశీ, అరుణకుమారి, వ్యవసాయశాఖ సిబ్బంది చరణ్, నాగమణి పాల్గొన్నారు.

చంద్రబాబు సృష్టించిన సంపద సున్నా

వైఎస్ఆర్ సీపీ సేవాదళ్ జిల్లా అధ్యక్షుడు మురళి


జ్యోతి ప్రజ్వలన చేస్తున్న సేవాదళ్ జిల్లా అధ్యక్షుడు ఉద్దగిరి మురళి, ఎంపీపీ హెప్సిబా

పెదనందిపాడు: ముఖ్యమంత్రిగా నారా చంద్రబాబు నాయుడు సృష్టించిన సంపద ఏమిలేదని వైఎస్ఆర్ సీపీ సేవాదళ్ జిల్లా అధ్యక్షుడు ఉద్దగిరి మురళి తెలిపారు. పెదనందిపాడులో గురువారం మధ్యాహ్నం ఆంధ్రప్రదేశ్‌కు జగనన్నే ఎందుకు కావాలి ? కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మురళి మాట్లాడుతూ చంద్రబాబునాయుడు చేసిన తప్పులు ఎల్లో మీడియాను కనపడవని, వారు కావాలని వైఎస్ఆర్ సీపీ ప్రభుత్వంపై బురదజల్లుతున్నారని విమర్శించారు. ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహనరెడ్డి ప్రజలందరికీ సంక్షేమ ఫలాలు అందిస్తున్నారని తెలిపారు. ఆయన పాలన ప్రజలకు మరలా అవసరమని చెప్పారు. మండల కన్వీనర్ షేక్ ఖాశీంపీరా మాట్లాడుతూ చెప్పింది చేసే ముఖ్యమంత్రి జగన్‌మోహనరెడ్డి అని, విద్యలో రాష్ట్ర సాధిస్తున్న ప్రగతిని చూసి ఐక్యరాజ్యసమితి ప్రశంసించిదని ఆయన గుర్తు చేశారు. రానున్న రోజుల్లో గృహ సారథులు, వలంటీర్లు, సచివాయాల కన్వీనర్లు, ప్రభుత్వం చేస్తున్న మంచి గురించి ప్రజలకు తెలియజేయాలన్నారు. ఈ నెల 9వ తేదీ నుంచి గ్రామాల్లో పర్యటించి ప్రజలతో మమేకమవుతున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో కల్చరల్ విభాగం జిల్లా అధ్యక్షుడు చెరుకూరి సాంబశివరావు, ఎంపీపీ హెప్సిబా, వైస్ ఎంపీపీలు షేక్ ఖాశీంబి, కమ్మ సాంబశివరావు, ఏబీపాలెం, పెదనందిపాడు సొసైటీ అధ్యక్షులు కె. భూషయ్య, డి. నాగేశ్వరరావు, సర్పంచులు దాసరి పద్మారావు, చెన్నుపాటి నరసింహారావు, సునీత, సాతులూరి సురేష్, ఎంపీటీసీ సభ్యులు మేడిద మాలతి, జంగా సుందర్, షేక్ రమేష్, ప్రత్తిపాడు మార్కెట్ యార్డు డైరెక్టర్ కొండా కృష్ణారెడ్డి, జేసీఎస్ కన్వీనర్ రవి, వలంటీర్లు, గృహ సారథులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

స్ఫూర్తి ప్రదాత.. విద్యాభివృద్ధికి చేయూత

- బజరంగ్ ఫౌండేషన్ సీఈవో అంబటి మురళీకృష్ణ ఆపన్నహస్తం
- కాపు విద్యార్థి వసతి గృహంలో రూ.30లక్షలతో ఫర్నీచర్ ఏర్పాటు


వసతి గృహంలో సదుపాయాలను పరిశీలిస్తున్న బజరంగ్ సీఈవో అంబటి మురళీకృష్ణ

కొరిటిపాడు(గుంటూరు): ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పాలనను ఆదర్శంగా తీసుకుని ఆయన అడుగుజాడల్లో నడుస్తూ ఇప్పటికే పలు సేవా కార్యక్రమాల్ని బజరంగ్ ఫౌండేషన్ సీఈవో అంబటి మురళీకృష్ణ నిర్వహిస్తున్నారు. గ్రామాల్లో పేదలకు వైద్య శిబిరాలు ఏర్పాటు చేస్తూ, ఆరోగ్యశ్రీ ద్వారా ఉచితంగా శస్త్ర చికిత్సలు చేయిస్తున్నారు. వృద్ధులకు కంటి పరీక్షలు నిర్వహించి, కళ్లజోళ్లను కూడా అందజేస్తున్నారు. ఇప్పుడు విద్యాభివృద్ధికి కూడా చేయూతనందిస్తూ స్ఫూర్తి ప్రదాతగా నిలిచారు.

కాపు వసతి గృహానికి భూరి విరాళం

ఇటీవల తెలగ అభ్యుదయ సంఘం నాయకులు నిర్మాణ దశలో ఉన్న కాపు విద్యార్థుల వసతి గృహ నిర్మాణానికి ఎంతో కొంత విరాళాన్ని అందించి సహకరించాలని అంబటి మురళీకృష్ణను అభ్యర్థించారు. నిర్మాణ దశలో ఉన్న వసతి భవన సముదాయాన్ని ఆయన స్వయంగా పరిశీలించి, నిర్వాహకులు విస్మయపరిచే విధంగా భారీ విరాళాన్ని ప్రకటించారు. ఐదు అంతస్తులలో 300 పడకలుగా నిర్మాణం జరుపుకున్న కాపు విద్యార్థి వసతి గృహానికి రూ.30 లక్షల వ్యయంతో పూర్తి ఫర్నిచర్, అంతర్గత సదుపాయాలను కల్పించారు. భవనానికి నూతన శోభను తీసుకువచ్చారు. ఆయన సహకారంతో రఘుపతి వెంకటరత్నం నాయుడు కాపు విద్యార్థి వసతి భవనం అద్భుతంగా తీర్చిదిద్దబడి ఈ నెల 1న ప్రారంభోత్సవానికి నోచుకుంది.

తాను పడ్డ కష్టాలు మరొకరు పడకూడదు: అంబటి

వసతి గృహాన్ని అంబటి మురళీకృష్ణ గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తాను 1979-80 సంవత్సరంలో గుంటూరు నగరం, పిచుకులగుంటలోని కూర్మ వెంకటరెడ్డి నాయుడు కాపు హాస్టల్‌లో ఉన్నానని గుర్తు చేశారు. వ్యక్తి గత మరుగు దొడ్లు, మంచాలు, దుప్పట్లు, అల్మారాలు వంటి కనీస సదుపాయాలు లేక తీవ్ర ఇబ్బందులు పడ్డానని చెప్పారు. ఆ అనుభవం నుంచి ప్రేరణ పొంది నేడు కాపు వసతి గృహానికి ఈ సదుపాయాలు అందించినట్లు తెలిపారు.

సందడిగా హ్యాండ్ బాల్ జిల్లా జట్టు ఎంపికలు



చేబ్రోలు: మండలంలోని నారాకోడూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అండర్-14 బాలుర, బాలికల హ్యాండ్ బాల్ జిల్లా జట్టు ఎంపికలు గురువారం జరిగాయి. జిల్లాలోని వివిధ పాఠశాలల నుంచి 170మంది విద్యార్థులు హాజరయ్యారు. విజయవాడలో ఈ నెల 10 నుంచి 12 వరకు జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో ఎంపికైన క్రీడాకారులంతా గుంటూరు జిల్లా జట్టుకు ప్రాతినిధ్యం వహించనున్నారు. ఎంపిక పోటీల్ని ఎంఈవో ప్రసాద్ ప్రారంభించారు. హెచ్ఎం ఎం. ఏడుకొండలు, పీఈటీలు ఉమామహేశ్వరి, టి. వెంకటేశ్వరరావు పర్యవేక్షించారు. కార్యక్రమంలో పీఈటీలు పి. నాగేశ్వరరావు, వినయ్‌కుమార్, రవి, సుధారాణి, విజయ పాల్గొన్నారు.